చిటుకతో ముప్పు

- ఎంటిరోటాక్సిమియా వ్యాధి ప్రాణాంతకం
- మండల పరిధిలో 33 వేలకు పైగా గొర్రెలు, మేకలు
- పాడి రైతులు అప్రమత్తంగా లేకుంటే తీరని నష్టం

తొండంగి: గ్రామీణ ప్రాంతాల్లో పాడి పశువులతో పాటు గొర్రెలు, మేకల వ్యాపారంపై ఆధారపడి ఎన్నో లక్షల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. తొండంగి మండలంలోని మేకలు, గొర్రెలు 33,024 వరకూ మూగజీవాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తొలకరి వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి పాడిపశువులతో పాటు గొర్రెలకు, మేకలకు వచ్చే చిటుక వ్యాధితో ప్రమాదం పొంచి ఉందని వ్యాధి రాకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు వేయించాలని పశు వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వీటన్నింటికీ గ్రామాల్లో పాడి పశువులు, గొర్రెలు, మేకలు ఉన్న ప్రతీ ఇంటికీ వెళ్లి పాడిపశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణకు వ్యాక్సిన్లు వేయడం పూర్తికాగా, ప్రస్తుతం మేకలకు, గొర్రెలకు వ్యాక్సిన్లు వేసేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించామని పశువైద్యాధికారి బి.చైతన్య వివరించారు. విడతల వారీగా వెటర్నరీ అసిస్టెంట్లు వ్యాక్సినేషన్ పూర్తిచేస్తున్నారు. సీజనల్ వ్యాధులపై పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.


బెండపూడిలో మేకలకు టీకాలు వేస్తున్న వైద్యుడు చైతన్య, సిబ్బంది

వ్యాధి లక్షణాలు..

చిటుక వ్యాధి సోకిన గొర్రెలు, మేకల్లో జ్వరం, పళ్లు కొరకడం, చెట్టుకు లేదా గోడకు అనించి పెట్టడం, కాళ్లతో పొట్టను తన్ను కోవడం, బిగుసుకుపోవడం, అధిక విరోచనాలు వంటి లక్షణాల ఉంటాయి. ఎటువంటి లక్షణాలు లేకుండా తెల్లవారే సరికి మరణిస్తాయిని వివరించారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వ్యాధిని గుర్తించిన వెంటనే విరోచనాలు యాంటీ డయేరియా పౌడర్‌ను తాగించాలి. సెలైన్లు పెట్టించాలి. ఈ విధంగా మూడు నుంచి ఐదు రోజుల పాటు వైద్యం అందించాలి. వ్యాధి నివారణకు తొలకరి వర్షాలకు ముందే నివారణా వ్యాక్సిన్ వేయించాలి.

వ్యాక్సిన్లు వేయించాలి



గ్రామ సచివాలయ పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్లు పశువు లున్న ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్లు వేస్తున్నారు. గొర్రెలకు, మేకలకు కచ్చితంగా ఈ ప్రాణాంతక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేయించాలి. మా పరిధిలో అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణకు టీకాలు వేయడం పూర్తయింది.

–బి.చైతన్య, పశువైద్యాధికారి బెండపూడి

ఎంటిరోటాక్సిమియా (చిటుక వ్యాధి)

గొర్రెలు, మేకల్లో ముఖ్యంగా వచ్చే ప్రాణాంతక వ్యాధి చిటుక వ్యాధి (దీనిని ఓవర్ ఈటింగ్ డిసీజ్) అంటారు. చిటుక వేసేంతలోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. కాబట్టి దీనిని చిటుక వ్యాధి అంటారు. తొలకరి వర్షాల అనంతరం పచ్చికబయళ్లలో వేపుగా పెరిగిన గడ్డి తినడం ద్వారా వ్యాధి వ్యాపిస్తుంది. గడ్డిలోని క్లాస్ట్రీడియం పెర్‌ఫెర్జెన్స్ క్రిమి కడుపులోకి వెళ్లి ఎప్సిలా అనే విషపదార్థాన్ని విడుదల చేస్తుంది. దీనివల్ల ఆరోగ్యంగా ఉన్న గొర్రెలు, మేకలు ప్రాణాంతకంగా పరిణమించి మృత్యువాత పడతాయి.

అనారోగ్య సమస్యలు ఉత్పన్నం

గొర్రెలు మేకలకు జలగలు, పాములు, బద్దె పురుగులు నట్టలు అనే అంతర పరాన్నజీవుల జరిపే పక్రియతో వ్యాధులు వ్యాపిస్తు ఉంటాయి. ఈ జీవులు ఆహారం, నీటి ద్వారా కడుపులోనికి ప్రవేశించి గొర్రె మేకలు తిన్న ఆహారాన్ని ఈ పరాన్నజీవులు తిని రక్తం పీల్చుకుని తాగడం వలన జీవిస్తాయి. పునరుత్పత్తి ద్వారా సంతానాభివృద్ధి చేసుకుని వ్యాధి వ్యాప్తి చెడమే కాకుండా వ్యాధి తీవ్రతను పెంచుతుంది. రక్త హీనత, కడుపు ఉబ్బరం, జీర్ణం కాకపోవడం, ఎదుగుదల లోపించడం వంటి లక్షణాలను కలిగిస్తాయి. తద్వారా నీరసం, నిరోధకశక్తి తగ్గిపోవడం వలన ఇతర వ్యాధులకు త్వరగా గురవ్వడం వంటి సమస్యల వలన పశువులు క్షీణించిపోతాయి. తద్వారా తగినంత బరువు పెరగకపోవడం వలన రైతులకు ఎంతో నష్టం ఏర్పడుతుంది.

మూడు నెలలకు ఒకసారి మందు తాగించాలి

రైతులు ప్రతీ మూడు నెలలకు ఒకసారి ఈ నట్టల నివారణ మందు తాగించినట్లైతే గొర్రె మేకలలో ఈ అంతర పరాన్నజీవుల వలన కలిగే వ్యాధులను అరికట్టవచ్చు. తద్వారా గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటాయి. అప్రమత్తంగా ఉండి వ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేయించాలి.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

ఏలేశ్వరం: తమ దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏలేశ్వరం పట్టణంలో శుక్రవారం వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. వీఆర్‌ఏల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వీఆర్‌ఏలు మాట్లాడుతూ తమకు పేస్కేల్ అమలు చేసి జీతాలు పెంచాలన్నారు. అర్హులైన వీఆర్‌ఏలకు అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. నామిని వీఆర్‌ఏలను వీఆర్వోలుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు షేక్‌దాదాసాహెబ్, కొత్తపల్లి సత్తిబాబు, పొట్లాడ రమేష్, జాజి మొగ్గల సత్యనారాయణ, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

ప్రత్తిపాడు: సమంజసమైన గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు అంబేడ్కర్ కళామందిర్ వద్ద గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ) చేపట్టిన ధర్నా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి, ఆందోళనకు మద్దతు ప్రకటించారు. మండల వీఆర్‌ఏల సంఘ అధ్యక్షుడు కొమరగిరి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

విశ్రాంత ఉద్యోగుల బకాయిలు మంజూరు చేయాలి

ప్రత్తిపాడు: విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం నుంచి రావలసిన బకాయిలను తక్షణం మంజూరు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, విశ్రాంత ఎంఈఓ ముక్కు సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రత్తిపాడు, కిర్లంపూడి మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ సమావేశం జరిగింది. విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పీఆర్‌సీ అరియర్స్, డీఏ బకాయిలు చెల్లించడంతో పాటు మధ్యంతర భృతి ప్రకటించి, మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు యలమంచిలి రామం, జంధ్యం సుబ్బారావు, బి.సూర్యనారాయణ మూర్తి, ఏఎస్ఆర్ శేషగిరిరావు, డి సీతారాం, విశ్రాంత రెవెన్యూ ఇనస్పెక్టర్ ఎం సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేయడమే కూటమి లక్ష్యం

శంఖవరం: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి వారిని మోసం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మండిపడ్డారు. మండలంలోని మండపం గ్రామంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి బీ.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకుని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో గిరిబాబు మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో 143కు పైగా హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలను తీసుకువస్తే వాటిని కూటమి ప్రభుత్వం ప్రవేటీకరించడం దారుణమన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో పేద ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం వెనక్కు తగ్గేవరకు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను,సర్పంచ్‌లు కూనిశెట్టి మాణిక్యం, రామిశెట్టి ఏసుబాబు, సకురు గుర్రాజు, పార్టీ నాయకులు ఈగల అప్పారావు, గౌతు స్వామి, నక్కా బాజ్జి, చప్పా అర్జున్,టి.నాగేశ్వరరావు, నక్కా మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.


మండపంలో పర్యటిస్తున్న ముద్రగడ గిరిబాబు, పార్టీ శ్రేణులు

మహిళల ఆరోగ్యంతో సమాజాభివృద్ధికి పునాది

గండేపల్లి: మహిళల ఆరోగ్యమే సమాజాభివృద్ధికి పునాది అని వైద్యాధికారిణి ఐ. హరిత కొనియాడారు. మండలంలోని పి.సూరంపాలెం పీహెచ్‌సీ పరిధిలోని యర్రంపాలెంలో శుక్రవారం 'స్వస్తినారి–స్వశక్తి పరివార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు మహిళల ఆరోగ్యమే కుటుంబానికి, సమాజాభివృద్ధికి పునాది అన్నారు. అనంతరం గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గండేపల్లి పీహెచ్‌సీ పరిధి మల్లేపల్లి సచివాలయం–1 నందు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్యులు కెవి నరేష్, బి సురేంద్ర, సీహెచ్‌ఓ శర్మ, వైద్య, ఆశ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహార లోపం నియంత్రణే లక్ష్యం

ప్రత్తిపాడు రూరల్: పోషకాహార లోపం, రక్తహీనతను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ టీడీఆర్ పద్మావతి తెలిపారు. మండలంలోని ధర్మవరం సచివాలయం–1లో శుక్రవారం పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు.యుక్తవయస్సులో ఉన్న బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులకు పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలపై అవగాహన కలిప్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.వరలక్ష్మి, గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి హరిత

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

కిర్లంపూడి: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత అన్నారు. స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద వైద్యుడు బి.రాంబాబు నాయక్ అధ్యక్షతన స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 90 మందికి మహిళలక వైద్య పరీక్షలు నిర్వహించడా 28 మందికి సర్వికల్ టెస్ట్‌లు నిర్వహించారు. నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు ఉచితంగా చేశామన్నారు. 18–45 ఏళ్ల మధ్యలో ఉన్న స్త్రీలు తప్పకుండా సర్వికల్ క్యాన్సర్ వేక్సిన్ తప్పక వేయించుకోవాలన్నారు. ఐసీడీఎస్ జగ్గంపేట సీడీపీఓ ఎం.పూర్ణిమ, వైద్యులు సాయి హేమాంజలి, సీహెచ్‌ఓ జ్యోతి, పీహెచ్‌ఎన్ కాశీ అన్నపూర్ణ, హెచ్‌ఎస్ రమణమూర్తి, అనంత లక్ష్మి, గణపతి వైద్య సిబ్బంది ఉన్నారు.

పోషకాహారంతో సమస్యలు దూరం

ఏలేశ్వరం: పోషకాహారంతో ఆరోగ్య సమస్యలు దరిచేరవని ప్రత్తిపాడు సీడీపీఓ పద్మావతి అన్నారు. మండలంలోని పెద్దనాపల్లి, మర్రివీడు గ్రామాల్లో శుక్రవారం పౌష్టికాహర మాసోత్సవాల్లో భాగంగా సుపోషిత భారత్ సక్షం భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చాన్నారు. ఈ కార్యక్రమం అంగన్‌వాడీ కేంద్రాల్లో వచ్చే 16వ తేదీ వరకు జరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతల సంరక్షణలో పురుషులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సూర్యకుమారి, సుంకర సత్తిబాబు, శెట్టి చిన్నా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


పెద్దనాపల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

దోమల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

జగ్గంపేట: వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమలు వ్యాప్తి పెరగకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని జగ్గంపేట పంచాయితీ ఈఓ జి.శివ అన్నారు. జగ్గంపేట పంచాయతీలో శుక్రువారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి సీజనల్‌గా వచ్చే వ్యాధులు, దోమల వల్ల వచ్చే జ్వరాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నేతలు ఎస్‌వీఎస్ అప్పలరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మరక్షణ మెళకువలపై శిక్షణ

జగ్గంపేట: విద్యార్థినుల ఆత్మరక్షణపై అవగాహన కలిగించడానికి జగ్గంపేట ప్రభుత్వం డిగ్రీ కాలేజీలో సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి.బింధుమాధవ్ ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు ఆపద సమయంలో ఎలా తమని తాము రక్షించుకోవాలి, అగంతుకులపై తిరిగి దాడి చేయడంలోని మెళుకువలను విద్యార్థినులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

లోపభూయిష్ట విధానాలతో ఇక్కట్లు

తుని: ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 రిజిస్ట్రేషన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు తునిలో దస్తావేజు లేఖరులు, స్టాంప్ వెండర్లు, డీటీజీ ఆపరేటర్లు పెన్‌డౌన్ నిర్వహించారు. ఓటీపీలు బహిర్గతం చేయడానికి ప్రజలు సంకోచిస్తున్నారన్నారు. డిపార్టుమెంట్‌లో సమన్వయ లోపంవల్ల పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని లోపాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు.

ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలి

ప్రత్తిపాడు రూరల్: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఓటీపీ విధానాన్ని రద్దు చేయాలని దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు పంచదార్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ చేసి ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. పీడీఈ విధానంలో లోపాలను సరిచేసి అక్రమాలకు ఆస్కారం లేని పాత విధానంలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగించాలన్నారు. ఓటీపీలను బహిర్గతం చేసేందుకు ప్రజలు సంకోచిస్తున్నారన్నారు.


ప్రత్తిపాడు రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

పాత విధానాన్నే కొనసాగించాలి

ప్రత్తిపాడు: మండల కేంద్రం ప్రత్తిపాడులో దస్తావేజు లేఖర్లు శుక్రవారం విధులను బహిష్కరించి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. రిజిస్ట్రేషన్ల విధానంలో ప్రవేశపెట్టిన నూతన విధానాన్ని నిరసిస్తూ కార్యాలయం ప్రధాన గేటు వద్ద శిబిరం ఏర్పాటు చేసి, ఆందోళనకు ఉపక్రమించారు. దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షుడు పంచదార్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఓటీపీ ద్వారా రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తే సబ్ ప్లాన్ గ్రామాలకు సెల్ సిగ్నల్స్ ఉండవని, ఇక ఓటీపీ ఎలా వస్తుందని ప్రశ్నించారు. నూతన నిబంధనలను సడలించి, ప్రస్తుతం కొనసాగుతున్న పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు కొనసాగించాలని కోరారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

కిర్లంపూడి: ధాన్యం కొనుగోలుపై వీఏఏలు, వీపీసీ సిబ్బంది, వీఆర్వోలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశం హాల్లో శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఏఓ జోకా అమృత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ నుంచి టెక్నికల్ అసిస్టెంట్స్ దుర్గాప్రసాద్, శ్రావణి పాల్గొన్నారు. రైతుకు మద్దతు ధర కల్పించేలా తీసుకోవల్సిన జాగ్రత్తలతో పాటు ధాన్యం కొనుగోలుపై పలు సూచనలు, సలహాలు అందజేశారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

రౌతులపూడి: ఈ నెల నాలుగున రౌతులపూడి శివారు మరిడమ్మ తల్లి గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన నడిగట్ల లక్ష్మి (69) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందిందని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోటార్‌సైకిల్ వెనుక కూర్చుని ప్రయాణిస్తున్న లక్ష్మిని మరిడమ్మ తల్లి గుడి వద్ద వెనుక నుంచి వస్తున్న మోటరుసైకిల్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన వారు చికిత్స కోసం ఆసుపత్రిలో చేరారు. పరిస్థితి విషమంగా ఉన్న లక్ష్మిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఆమె మృతి చెందిందన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన అన్నారు.

ఖైదీలకు న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి శుక్రవారం తనిఖీ చేశారు. నిందితులకు అందించే భోజన వసతులు, మంచినీరు సౌకర్యాలపై ఆమె ఖైదీలను ఆరా తీశారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు ప్రభుత్వం నుంచి న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం, ప్యానెల్ అడ్వకేట్లు బుగత శివ, అవసరాల దేవి, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని బెండపూడి శివారు సుబ్బరాయపురంలో శుక్రవారం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని బుల్లెట్ బైకు ఢీకొట్టిన సంఘటనలో వ్యక్తిమృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.జగన్మోహన్‌రావు తెలిపారు. మండలంలోని రావికంపాడుకు చెందిన చిత్రాడ రాజు మోటార్ సైకిల్‌పై తన కుమారుడు తాతాజీ నిర్వహిస్తున్న పాత సామాన్లు షాపు వద్దకు వచ్చాడు. షాపు మూసివేసి తిరుగు ప్రయాణంలో మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా బెండపూడి వైపు నుంచి బుల్లెట్ బైకు అతివేగంగా వచ్చి బలంగా ఢీకొట్టింది. రోడ్డుపై పడిపోయిన చిత్రాడ రాజు(50)ను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

మోతాదు మించితే ముప్పే..

కోటనందూరు: వరిలో యూరియా వినియోగం మోతాదుకు మించితే ముప్పు వాటిల్లుతుందని మండల వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్ అన్నారు. జగన్నాధపురంలో రైతులు, విద్యార్థులతో కలిసి వ్యవసాయశాఖ సిబ్బంది యూరియా వినియోగంపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామకోవెల వద్ద మానవహారంగా ఏర్పడి పంటల సాగులో యూరియా వినియోగాన్ని తగ్గించాలని, నానో యూరియా వినియోగించాలని నినాదాలు చేశారు. ఏఈఓలు అప్పారావు, సురేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

ఏలేశ్వరం: పట్టణంలోని కప్పలచెరువు సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కారించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం స్థానిక జగనన్న కాలనీలో సమావేశమై కాలనీ వాసులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బదిరెడ్డి గోవిందు, శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, కోరాడప్రసాద్, వాగు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

గోకవరం: గోకవరంలో ఇద్దరు యువకుల చేతిలో అత్యాచారానికి గురైన మైనర్ బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని పీడీఎస్‌యూ విజృంభణ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి తహసీల్దార్ రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో ఇలాంటి ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ప్రభుత్వం బాధితురాలి కుటుంబానికి అన్నివిధాల ఆదుకొని ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీ విముక్తి) జిల్లా కన్వీనర్ డొక్కులూరి సంగీత, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సత్కారం


డీఎం దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

ఏలేశ్వరం: రాష్ట్రంలో అత్యధిక లాభార్జనతో రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న తుని ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణను విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం ఘనంగా సన్మానించారు. దంపతులను శాలువాలు, పూలమాలలతో సత్కరించి సన్మాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అలమండ దుర్గా వెంకటప్రసాద్, కటకం కిరీటి మాట్లాడుతూ తుని ఆర్టీసీ డిపోకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ డిపో అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యులు తూమురౌతు గురయ్య, వుడతల రమణారావు, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ


రవికుమార్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఏలేశ్వరం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా సీహెచ్ రవికుమార్ వర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఏఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ పదోన్నతిపై పెద్దాపురం వెళ్లారు. ఎంపీడీఓ రవికుమార్‌వర్మకు సిబ్బంది పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

రాష్ట్ర పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు

తుని రూరల్: రాష్ట్రస్థాయి కురాష్ పోటీలకు వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ అమృతవాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ రాజమండ్రి ఎస్‌కేవీటీ కళాశాలలో శుక్రవారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి అండర్ 19 విభాగంలో ప్రణతి, తనుశ్రీ, అండర్ 14 విభాగంలో నిఖిత, జ్యోతీలావణ్య, సమీర రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్టు ఆమె వెల్లడించారు. వ్యాయామ ఉపాధ్యాయురాలు అర్చన, సిబ్బంది విద్యార్థినులను అభినందించారు.

ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: ఐటీఐలో నాలుగో విడత ప్రవేశాలకు ఈనెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తుని నోబుల్ ఐటీఐ కరస్పాండెంట్ డి.సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి గాను ఇంటర్, పదో తరగతి పాస్‌కాని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 28న ధృవపత్రాల పరిశీలన జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 92466 94266 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సత్యదేవుని సన్నిధిలో పీఠాధిపతి

అన్నవరం: కర్నాటక రాష్ట్రం ఉడిపిలోని పెజావర్ మధ్వాచారపీఠ మహా సంస్థానం పీఠాధిపతి, అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ట్రస్ట్ ధర్మకర్తలలో ఒకరైన శ్రీ విశ్వ ప్రసన్న తీర్థ స్వామి తన శిష్య బృందంతో కలిసి శుక్రవారం రత్నగిరిపై సత్యదేవునిని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి పండితులు ఘనస్వాగతం పలికారు. సత్యదేవుని దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందచేయగా సత్యదేవుని చిత్రపటం, ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందచేశారు. రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని ఆలయంలోని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండదిగువన తొలిపావంచా వద్ద కొలువైయున కనకదుర్గ అమ్మవారికి పండితులు కుంకుమపూజలు ఘనంగా నిర్వహించారు.

'అస్సాగో'లో వైద్య శిబిరం

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి గ్రామంలో అస్సాగో ఇథనాల్ పరిశ్రమలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పరిశ్రమలో పని చేస్తున్న సిబ్బందితో పాటు స్థానిక ప్రజలకు కంటి పరీక్షలు, దంత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రగతి సాధించాలి

ప్రత్తిపాడు: విద్యార్థులు నేరాల జోలికి పోకుండా విద్యారంగంలో ప్రగతి సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు, గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం సూచించారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నేర ప్రవృతిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై లక్ష్మీకాంతం మాట్లాడుతూ పాఠశాలలో గానీ, పరిసరాల్లోగానీ ఎవరైనా నేర ప్రవృతి కలిగి ఉన్నా, అనుమానాస్పదంగా అపరిచితులు సంచరిస్తున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ జాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.